


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### కరోనా

**కరోనా..ప్యార్ హై** అని సినిమా తియ్యచ్చు. ఎవరు ఎవరికి ఫోన్ చేసినా ఇదివరకు "బావున్నారా?"తో సంభాషణ ప్రారంభం అయ్యేది.

ఇప్పుడు "మీ ఊళ్ళో కరోనా ఎలా ఉందండీ? వర్క్ ఫ్రం హోమేనా?" అని సంభాషణ ప్రారంభిస్తున్నారు.

ఇంక వర్క్ చేసేవాళ్ళకి రెండు రకాల కష్టాలు. ఒకటి వర్క్. బాస్ ఎప్పుడైనా ఫోన్ చెయ్యొచ్చు. రెండు మీటింగ్‌లో వున్నప్పుడు అత్తగారు పనిమనిషితో పోట్లాడుతూ "అసలు నిన్ను తీసేసా. నువ్వూ నీ పొగరూనూ. ఎలాగూ ఈ నెలంతా మా కోడలు ఇంట్లోనే ఉంటోంది. కరోనా సెలవులు" అనడం వినబడితే గుండె గుభేలు. ఆ పనిమనిషి 'ఔనమ్మా నాకూ కరోనా సెలవులే' అని వెళ్ళిపోతే తన పరిస్థితి ఏవిటని? ఆ ఇంటి ఇల్లాలి దిగులు.

లాగ్ ఇన్ అవగానే ఆఫీస్ పనిలో "అమ్మా నా బ్లూ డ్రెస్ మీద టాప్ ఎక్కడ పెట్టావు?"

"అమ్మా కేరమ్ బోర్డ్‌లో రెడ్ కాయిన్ కనిపించడంలేదు"

"ఆనందీ నా సాక్స్‌లు వాషింగ్ మెషిన్‌లో వేస్తే ఒకటే వచ్చింది. రెండోది ప్రతిసారీ వాషింగ్ మెషిన్ మింగేస్తోందా?" అన్న భర్త ప్రశ్న.

ఇంక హౌస్ వైఫ్స్ పరిస్థితి ఎలా ఉందంటే "అందరూ ఆఫీసులకి వెళ్తేనే నయం వదినా. మగాళ్ళు ఇంట్లో ఉంటే భరించలేం అనుకో. నిమిషానికోసారి మంచినీళ్ళూ, పదినిమిషాలకోసారి కాఫీ అందించాలి."

"పిల్లపిశాచాల సంగతి చెప్పవేం వదినా? వాకిట్లోకి వెళ్ళి నానా చెత్తా ముట్టుకుని వస్తారా చేతులు కడుక్కోండి. శానిటైజర్ రాసుకోండని నేను పాట పాడుతుంటే, కొరియర్ బాయ్, బిగ్ బాస్కెట్ వాడూ నా శానిటైజర్ పాటకి 'అమ్మా ఇలా అందరిళ్ళల్లో చేతులు కడుక్కుంటూ ఉంటే, మా చేతులు పొప్పర్లు రేగిపోతున్నాయి' అంటూ బెల్ కొట్టి సామాన్లు పారేసి పారిపోతున్నారు."

"మా డ్రైవర్ అయితే నా చాదస్తానికి శానిటైజర్ చెంబులో కలిపి కారంతా తుడుస్తున్నాడు. ఇంక పనిమనిషి 'తుస్కా తుస్కా' అని తుమ్మి 'పోవే పనికి రాకు జీతం ఇస్తాలే' అని నా నోటితోనే చెప్పించి పారిపోయింది. పిల్లలు సింక్ నిండా తినీ తాగీ సామాన్లు పారేస్తున్నారు."

"అంతేనా వదినా? అసలు బజార్లో ఈ శానిటైజర్లూ, పేపర్ నేప్‌కిన్సూ దొరకడంలేదు. మా చిన్నాడికి అమెరికాలో శానిటరీ పేపర్ దొరక్క తెగ ఇబ్బంది అవుతోందిట"

"సరిపోయింది. అసలు కూరగాయలూ, నూనె, బియ్యం, కందిపప్పూ అందరూ కొనేసి ఇళ్ళల్లో స్టాక్ చేసేస్తుంటే, శానిటరీ పేపర్ గొడవేంటమ్మా?"

"ఇండియాలో అయితే మా అత్తగారూ, మావగారూ సందు దొరికింది కదా అని 'చూసారా మిరియాలూ, ఇంగువా, వెల్లుల్లీ, అల్లం వాడితే ఆ మహమ్మారి అసలు దగ్గరకి రాదుట. నమస్కారం మన సంస్కారం అని చెపితే విన్నారా? ఇప్పుడు చూడండి చేతులూ చేతులూ ఆ చైనావాడితో కలిపి, వాడు తయారు చేసిన సామాన్లన్నీ కొని ఈ లోకానికి ఇంత ఉపద్రవం తెచ్చి పెట్టారు. మాంఛి ఆవ పెరుగు వడలు చెయ్యి. దెబ్బకి వదిలిపోతుంది కరోనా" అని ఒకరూ.

"అల్లం పచ్చిమిరపా వేసి పెసరట్లూ, ఉప్మా చెయ్యి యూ ట్యూబ్‌లో వంతెన మంచినారాయణగారు చెప్తున్నారూ" అని ఒకరూ

ఇలా సెల్‌లో గంటలు గంటలు ఇల్లాళ్ళు వ్యధలు పంచుకుంటుండగా, మగాళ్ళ కష్టాలు వేరే. ఆఫీస్ పని ప్రారంభించగానే "చంటాడి డైపర్ చూడండి నా చెయ్యి ఊరికేలేదు. ఏడుస్తున్నాడు" అని వాడిని అందించి వెళ్ళిపోతుంది శ్రీమతి. చంటాడి డైపర్ మారుస్తుండగా, వీడియో కాల్‌లో బాస్‌గారు టీమ్‌తో ప్రత్యక్షం.

"వై ఆర్ యూ మేకింగ్ పోరిడ్జ్? ఇన్ ఆఫీస్ టైమ్?" అంటే,

సుబ్బారావ్ "దిసీజ్ నాట్ పోరిడ్జ్ మై త్రీ మంత్స్ కిడ్స్ డైపర్."

"ఓ!.. దిస్ ఈజ్ నాట్ గుడ్ ఆన్ యువర్ పార్ట్" అని ఆయన ముక్కు మూసుకుంటే.

సుబ్బారావు "సో కెన్ ఐ కమ్ టు ఆఫీస్. దేర్ ఆర్ టూ కేసెస్ రిజిస్టర్డ్ ఇన్ అవర్ కౌంటీ ఎస్టర్డే"

బాస్ భయంగా "నో ఐ యామ్ వర్కింగ్ ఫ్రం హోమ్ టూ ప్లీజ్ కాల్ మీ ఆఫ్టర్ పోరిడ్జ్ సారీ. డైపర్ చేంజ్."

ఇంకా కొంతమంది లాగిన్ అయి, పేకాటా, సీసాలు పెట్టుకుని, వర్క్‌ఫ్రం హోమ్ చేసేవాళ్ళూ ఉన్నారు. ఇంక బిజినెస్‌ల కేం డోఖా లేదు "వెల్లులి రసంతో శానిటైజర్లు చేసి పంపుతాం. ఆన్‌లైన్ ఆర్డర్స్ ఇవ్వండి" అని ఒకరు, "మా పచ్చడ్లూ పొడులలో శాస్త్రబద్ధంగా కరోనాని తరిమికొట్టే అల్లం, మిరియం, ధనియం ఉన్నాయి. త్వరపడండి. సరుకున్నంతవరకే లభ్యం" అని ఒకరు.

"నా మాల్కోస్ రాగం కేసెట్లు వినండి. ఏ భయంకర రోగం అయినా నా సంగీతానికి పారిపోవాల్సిదే మా పక్క వాటాలో వాళ్ళు నెలకొకళ్ళుమారతారు. కావాలంటే ఎవరినైనా కనుక్కోండి" అని ఫేస్ బుక్‌లో ఓ ఇల్లాలి ప్రకటన.

ఓ ప్రవచన కర్త "నాయినా! బ్రహ్మంగారెప్పుడో చెప్పారు. లోకమంతా మునిగిపోతుంది. మనిషిని చూసి మనిషి భయపడి పది ఆమడల దూరం పరిగెడ్తాడని. మనిషి తినే తిండి వల్ల ఈ మహమ్మారి వస్తుందని. ఇది అసలు కాసార సరీస్రపానిశి వీక్షణ పక్షివాతం. అనగా అడవుల్లో తిరిగే పాములని తినే పక్షుల వల్ల వ్యాపించే రోగం అని చరకుడు ఆనాడే చరక సంహితంలో చెప్పాడు. ఇది ప్రమాణిక గ్రంధం. మీ మొహాలు తగలడా తెలుగు మీడియం వద్దంటారూ, ఈ పురాణ, విజ్ఞాన సారస్వతాన్ని చదవరూ. బుల్‌షిట్ నాన్‌సెన్స్‌లు భుజిస్తారు, గబ్బిలాలూ, ఎలకల సూప్‌లు తాగి తగలడి లోక కంటకులు అవుతారు. ఏ జగన్మాతో అవతారం ఎత్తి ఈ దేశాలు దేశాలు తుడిచి పెట్టేస్తుంది.

హాచ్! హాచ్.. మీ మొహం ఈడ్చ. ఎవరంటించార్రా ఈ తుమ్ములు. రెండు తుమ్ములు తుమ్మితే మా ఆవిడ విడాకులిచ్చిపోతానని బెదిరిస్తోంది. ఈ కాలంలో అనసూయలూ, అరుంధతిలూ, సుమతిలూ లేర్రా. ఈ విమెన్ ప్రొటెక్షన్ సెల్, సైబర్ క్రైం వీరనారీమణులే ఉన్నారు."

ఇంక భారత ప్రధాని టీ.వీల్లో కొచ్చి "భాయియో.. బెహనియో నేను చెప్పానా పేపర్ మనీ రెవెన్యూ వద్దురా అవి నానా చేతులు మారి మన చేతుల్లోకొస్తాయి. మన భారతదేశంలో అసలే చేతులు అన్నింటికీ వాడేస్తూ ఉంటారు. అసలు వేళ్ళు ఇచ్చింది ముక్కుల్లో నోళ్ళల్లో చెవుల్లో ఇంకా కొన్నిచోట్లా దూర్చుకోడానికే, గోక్కోడానికే అని నమ్ముతారు మన ప్రజలు. అందుకే క్యాష్‌లెస్ రెవెన్యూ అంటే కార్డూ, పేటీయమ్ వాడుతున్నా, ఎవడో పిన్ కొట్టేస్తాడనీ సైబర్ నేరాలు జరుగుతాయనీ, ప్రాణాలు తీసుకుంటారేమ్మరా? ఓ పని చెయ్యండి మీకు మీరే కర్ఫ్యూ విధించుకుని ఇళ్ళల్లో ఉండండి. సాయంత్రం ఏడుకాగానే బాల్కనీల్లోకొచ్చి చప్పట్లు కొట్టండి. ఏ ఇంట్లో చప్పట్లు మోగలేదో ఆ ఇంటికి 'ఆపద్భందూ' పంపిస్తాం. శ్మశానంలో సుంకంలేదు. పెళ్ళిళ్ళూ, ఎలక్షన్లూ, సినిమాలూ మానేసి 'ఓం' చెప్పండి. ఓంకారంలో ఉంది రోగనిరోధక శక్తి. ఆ శక్తితోనే నేను పి.ఎమ్ అయ్యాను. ఓం!"

ఇంక మా తెలుగు జాతికిద్దరు ఆణిముత్యాల్లాంటి చీఫ్ మినిస్టర్లు. "ఒకాయన ప్యారాసిటమాల్ వేసుకోండి, కరోనా గిరోనా పారిపోతుంది" బహుశా ప్రజల్లో భయాందోళనలు తగ్గించడానికే అలా అని ఉంటారు ఆ ముఖ్యమంత్రి.

ఇంకో ఆయన "ఎవులు చెప్పింలయ్యా కరోనా మీ పక్కింటి పోరా? పొగపెడితే, పాట పాడితే పారిపోనీకి. శుభ్రంగా చేతులు కడుక్కోండి. తైవాన్‌ల లెక్క ఎవరింటికి పోకుండ్రి, ఎవుల్ని రానియ్యకుండి. పొరుగుదేశాలనుండొస్తే తలుపు తెరిచి ఒక్క లాత్ తన్నుండి. యిమానాశ్రయాలని మూసి వెయ్యకుండా మన ప్రధానమంత్రి బొట్టూ పేరంటం ఎందుకు పిలుస్తుండో ఎరుకైతలేదు. బతుకమ్మని మంచిగ చెయ్యలే ఈ పాలి అందరం. కరోనాని తరిమికొట్టినంక టాంక్‌బండ్ మీద బతుకమ్మ ఆడి, నీళ్ళల్లో కలిపి, పసుపు కుంకుమ జల్లుకోవాలె. ఆ ఇలేకరి ఏమో అడుగుతుండు. 'ఏందయ్యా నీ ప్రశ్న? గాంధీ ఆసుపత్రిల కరోనా పీడితులుంటే, మిగతా రోగులకంటతదా? అయితే సంపెయ్యాలా? ఆ కరోనా పీడితులని. ఏం ప్రశ్నయ్యా? దమాక్ వున్నదా నీకు? ఇంక కూసో నీ ప్రశ్న వేస్ట్. నీ పుట్టుక వేస్టూ కూసో! ఎవడో దరిద్రుడు చైనాకెల్లి పట్టుకొచ్చి ఇంత పరేషానీ పెట్టిండు. ఏందివయ్యా? చైనా వాల్ కడ్తానంటే ఆ ట్రంప్ మెక్సికో వాల్ కడ్తానన్నప్పుడే నవ్వబట్టింరు. గోడలకెల్లి పగుళ్ళు తీసినది. అందుకే గివన్నీ. చైనా సామాన్లు కొనకుండా బతకలేరా మీరు? మొగుళ్ళకి పెళ్ళాలని, పెళ్ళాలకి మొగుళ్ళని నిలబెట్టి డూప్లికేట్‌లు చేసి పంపేటోల్లు వాళ్ళు. ఈ కరోనా కూడా వాళ్ళు తయ్యారు చేసినదే. ఈ సావులు కూడా మేడ్ ఇన్ చైనానే. ఎగబండ్రుండ్రి" .

సి.ఎమ్, పిఎమ్‌ల స్పీచ్ నేను హాస్యంగా రాసినా వాళ్ళు చేస్తున్న సేవ అపారం. వాళ్ళ ఆదేశాలని పాటించండి. కరోనాని పారదోలదాము.

ఇంక సినిమా వాళ్ళయితే, హాళ్ళూ, సినిమాలూ, షూటింగ్‌లూ, మీటింగులూ లేక తారెత్తిపోతున్నారు. పెట్టిన పెట్టుబడులూ, పెరుగుతున్న వడ్డీలూ తలుచుకుని.

ఇంక తెలివైన అమ్మాయి ఒకత్తి కాబోయే పెళ్ళికొడుకుని ఇంటికి పిలిచి పుస్తె కట్టించుకుని, కరోనా బంద్‌లు అయ్యాక గ్రాండ్‌గా పార్టీలు ఇస్తాం. ఈలోగా గిఫ్ట్‌లుగా హాండ్ శానిటైజర్లూ, కిచెన్ టవల్సూ పంపమని బంధువులకీ, స్నేహితులకీ వాళ్ళ పెళ్ళి వీడియోలు పంపింది.


ఇదివరకు సోమిదేవమ్మగారు, పనిమనిషి అంట్లు తోమినా, పెరుగమ్మి పెరుగు పిడతిచ్చినా, కూరలమ్మి కూరగాయలిచ్చినా, నీళ్ళు జల్లి తీసుకుంటుంది. ఇంటికెవరైనా వస్తే కాళ్ళు కడుక్కోమంటుంది. ఎవరొచ్చినా దూరంగా తలుపు వార నిలబడి చేతులు జోడిస్తుంది. మడిగా శుచిగా వండుకుని తప్ప ముద్ద నోట పెట్టదని వెక్కిరించిన ఆధునిక యువతులంతా సోమిదేవమ్మలూ, యువకులంతా సోమయాజులూ అయ్యారు.


ఇంక శాడిస్టులు కొంతమంది "ఇదిగో లోకం మునిగిపోతోంది. అందరూ చచ్చిపోతారు. జ్యోతిష్యశాస్త్రం అదే చెప్తోంది" అని యూ ట్యూబ్‌లో, టీ.వీల్లో ప్రజల్ని మరింత భయపెడ్తుంటే, ఇంకా కొంతమంది "అక్కడ వెయ్యిమంది... మొత్తం 80వేలమంది చనిపోయారు" అంటూ ఎఫ్.బి పోస్టులు పెట్టి, కసబ్‌లాగా విధ్వంసం సృష్టించేస్తున్నారు.

ఇదివరకు మసూచి అనేది అమ్మవారు, మహమ్మారి అన్నారు. ఇంతకన్నా దారుణంగా వ్యాపించేసింది ప్లేగు. చీపురుతో తుడిచేసినట్లు కొన్ని ప్రాంతాలు తుడిచిపెట్టేసింది. ఆ తరువత సార్స్, ఇబోలా, ఇలా కరోనా. సంవత్సరానికో పేరుతో వైరస్ మహమ్మారిలొస్తూనే ఉన్నాయి. అన్నింటినీ మన శాస్త్రజ్ఞులూ, వైద్యులూ విజయవంతంగా తుడిచి పెట్టేసారు. దీనికీ మందు కనిపెడ్తారు. అంతదాకా శుభ్రతా, సంయమనం పాటిద్దాం. అనుమానాలొస్తే పరీక్షలు చేయిద్దాం. భగవన్నామం చేద్దాం. ఈ కరోనా అమ్మా మొగుడంతటి రోగాల్నే తుడిచి పెట్టేసాం. దీన్నీ తరిమి కొడదాం. మళ్ళీ మామూలు పరిస్థితులు వస్తాయి. అంతదాకా కుటుంబ సభ్యులతో ఆహ్లాదంగా గడుపుదాం. సర్వేజనా సుఖినోభవంతు.. ఓం!




Post your comments




https://www.youtube.com/watch?v=ERaaX_IulS4